సర్వేకు సహకరించాలి

సాక్షి, నెట్‌వర్క్: సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేపై ఎంపీడీఓ నాగేందర్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. మంగళవారం పెద్దకొత్తపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణలో ఆయన హాజరై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సర్వే చేసే ఇళ్లకు స్టిక్కర్లను అతికించాలని సూచించారు. ఒక్కొక్కరికి 150 ఇళ్లను కేటాయించామన్నారు. మండల ప్రజలు సర్వేకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


పెద్దకొత్తపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ ఇస్తున్న ఎంపీడీఓ నాగేందర్

■ సమగ్ర కుటుంబ సర్వేకు ఉపాధ్యాయులు బాధ్యతగా విధులకు హాజరుకావాలని వెల్దండ ఇన్‌చార్జ్ ఎంఈఓ చంద్రుడు పేర్కొన్నారు. ఎమ్మార్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వేను ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతుందన్నారు. ప్రజలు అందుబాటులో ఉండి కుటుంబవివరాలు తెలపాలన్నారు. మండలంలోని 32 గ్రామాలకు చెందిన 98 మంది ఉపాధ్యాయులు, ఎమ్మార్సీలో పనిచేస్తున్న నలుగురు సర్వేలో పాల్గొంటారని తెలిపారు.

■ సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేకు ప్రజలు సహకరించాలని చారకొండ ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ కోరారు. మండల వ్యాప్తంగా సర్వేకు 7328 ఇళ్లు గుర్తించినట్లు తెలిపారు. 49 మంది ఎన్యూమనేటర్లు, 5 మంది సూపర్‌వైజర్లు నియమించినట్లు వివరించారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు


అచ్చంపేట భక్తమార్కండేయ శివాలయంలో ఆకాశదీపం వెలిగిస్తున్న భక్తులు


లింగాల ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని భక్త మార్కండేయ శివాలయంలో మంగళవారం కార్తీకమాసం సందర్భంగా ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. కార్తీక మాసం ప్రతిరోజు ఆకాశ దీపం వెలిగిస్తునట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు పర్వతాలు పేర్కొన్నారు. ఆలయ అర్చకులు చిదంబర శర్మ, రాఘవేంద్ర శర్మ, భక్తులు పాల్గొన్నారు.

లింగాల: మండల కేంద్రంలోని కోదండరామాలయం, ఆంజనేయస్వామి, అయ్యప్ప స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిరోజు అభిషేకాలు, అర్చనలు, దీపారాధనలు చేస్తున్నారు. మంగళవారం ఆంజనేయస్వామి ఆలయంలో ఆకుపూజలు నిర్వహించారు. భజన మండలి ఆధ్వర్యంలో భజనకీర్తనలు ఆలపిస్తున్నారు.

వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

తాడూరు: మండలంలోని సిర్సవాడలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం జిల్లా సహకార శాఖ అధికారి రఘునందన్ రావు, సింగిల్ విండో చైర్మన్ రాంచంద్రారెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ గ్రేడ్ రకం వరి క్వింటాల్ రూ.2320, బీ గ్రేడ్ రకానికి రూ.2300 మద్దతు ధర ప్రభుత్వం ఇస్తుందన్నారు. సన్న రకం వడ్లకు రూ.500 బోనస్ ఇస్తుందని వివరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రమేష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాజేందర్‌రెడ్డి, రైతులు అల్లోజి, మల్లేష్, అరవింద్ రెడ్డిలు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీఓ

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి



మన్ననూర్: కార్తీక మాసం శుక్ల పక్ష పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు భక్తి శ్రద్దలతో మంగళవారం నాగుల చవితి నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలోని పుట్ట వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు నర్సింహశాస్త్రి, సంబు శోభ, జయమ్మ, సరస్వతి, పద్మజా, ప్రభావతమ్మ, వెంకటరమణ, సత్యనరాయణ, శేఖర్, రామాచారి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన కిష్టమ్మ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి ఎడ్మ కిష్టారెడ్డి మెమోరియల్ ట్రస్టు ద్వారా రూ. 5 వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో జనార్దన్ రెడ్డి, వెంకటేష్, సూరి, భీముడు తదితరులు పాల్గొన్నారు.

తాడూరు: మండలంలోని గుంతబండతండాకు చెందిన ముత్యాలమ్మ(65) అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న విండో అధ్యక్ష, ఉపాధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, వెంకట్‌రెడ్డిలు కలిసి బాధిత కుటుంబానికి రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. డైరెక్టర్ కృష్ణయ్య, రిటైర్డ్ సీఈఓ ఆంజనేయులు, కాంగ్రెస్ నాయకులు వెంకటయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

లింగాల: మండల కేంద్రానికి చెందిన మేంద్రగుత్తి రాజు అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు కేటీ తిర్పతయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.15 వేలు ఆర్థికసాయం అందించారు.

పాఠశాలలో మౌలిక వసతుల పరిశీలన

కొల్లాపూర్: పట్టణంలోని 5వ వార్డులో ప్రభుత్వ మాడల్ హైస్కూల్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్యనాగరాజు మంగళవారం సందర్శించారు. పాఠశాలలోని మౌలిక వసతులను పరిశీలించారు. పాఠశాలకు ప్రహరీ నిర్మాణం చేపట్టాలని ఉపాధ్యాయులు కోరగా ఆమె స్పందించి మంత్రి జూపల్లి కృష్ణారావుతో ఫోన్లో సమస్యలను వివరించారు. ప్రహరీ నిర్మాణానికి రూ.లక్ష మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మహిమూదాబేగం, ఖాదర్‌పాషా తదితరులు ఉన్నారు.

మత్తు పదార్థాలతో అనారోగ్యం



అమ్రాబాద్: మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల అనారోగ్యబారిన పడతారని వైద్యాధికారి సుధాకర్ సూచించారు. జాతీయ టొబాకో కంట్రోల్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని లక్ష్మాపూర్(బీకే), లక్ష్మాపూర్(బీకే)తండాలో పొగాకు, మత్తు పానీయాలు తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్య సమస్యలపై కళాజాత ప్రదర్శన నిర్వహించారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సుధాకర్ పాల్గొని ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. బీడీ, సిగరెట్, జర్దా, గుట్కాలతో క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, కళాజాత బృందం పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని ఆందోళన


ఆందోళన చేస్తున్న ఏబీవీపీ విద్యార్థులు, నాయకులు

కల్వకుర్తి టౌన్: విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ శివశంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో కళాశాలల విద్యార్థులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్కాలర్‌షిప్‌లను విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులు మధ్యలోనే చదువు ఆపేయాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయకపోతే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ ప్రశాంత్, మోహన్, సంతోష్ పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోండి

మన్ననూర్: రైతులు తమ పొలాలలో భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏఈఓ సీతారాం కోరారు. మట్టి పరీక్ష నమూనాల ఆధారంగా పొలంలోని నేల ఉదజని(పీహెచ్), లవణ సూచిక(ఈసీ), సేంద్రియ కర్బనం(ఓసీ), లభ్య నత్రజని, భాస్వరం, పొటాష్, (ఎన్‌పీకే) తదితర విషయాలు తెలుస్తాయన్నారు. ఒక్కొక్క నమూనా పరీక్షకు కేవలం రూ. 200లు రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు సెల్: 8074825497 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

విగ్రహాల ధ్వంసం బాధాకరం

మన్ననూర్: హిందు దేవాలయాలపై దాడులు, తరుచుగా విగ్రహాలను ధ్వంసం చేస్తుండటం బాధాకరమని విశ్వహిందు పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు సంబు వెంకటరమణ పేర్కొన్నారు. సికిందరాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహంపై ధ్వంసం చేయడాన్ని రాష్ట్ర ప్రజలు మరువకముందే శంషాబాద్ ఎయిర్‌పోర్టు కాలనీలోని హనుమాన్ ఆలయంలోని నవగ్రహ విగ్రహాలను ధ్వంసం చేయడం బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలన్నారు. ఆలయాలపై దాడులు చేస్తున్న దుండగులను గుర్తించాలని డిమాండ్ చేశారు.

సస్యరక్షణ చర్యలతో లాభాలు



మన్ననూర్: స్థానిక రైతువేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో భాగంగా వ్యవసాయ శాస్త్రవేత్తలతో రైతులు ముఖాముఖిగా మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రస్తుత యాసంగిలో సాగు చేసిన పంటల యాజమాన్య పద్ధతుల గురించి రైతులు అడిగిన సమస్యలకు శాస్త్రవేత్తలు సులభతరమైన భాషలో వివరించారు. వేరుశనగ పంటలో పొగాకు లద్దె పురుగు నివారణ గురించి వివరించారు. ప్రాథమిక దశ నుంచే సస్యరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా వ్యవసాయ విస్తరణ అధికారులు పంట పొలాల క్షేత్ర పర్యటనలు చేస్తూ రైతులకు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈఓలు సీతారాం, భార్గవి, మౌనిక, ఐసీఐసీఐ ఫౌండేషన్ డీఓ గంగాధర్ రావ్, రూరల్ లైవ్‌లీవుడ్ పాట్నర్ గంధం అంతయ్య, మన్ననూర్, ప్రశాంతి నగర్, వెంకటేశ్వర్లబావి, తుర్కపల్లి, వటువర్లపల్లి గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగుల వివరాలు నమోదు చేయాలి



అమ్రాబాద్: సమగ్రకుటుంబ ఇంటింటి సర్వేలో దివ్యాంగులను పదమూడో కాలంలో ఖచ్చితంగా నమోదు చేయాలని వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం అమ్రాబాద్‌లో దివ్యాంగుల మండల స్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సర్వేకు సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జిల్లా నాయకురాలు వెంకటమ్మ తదితరులు ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

అచ్చంపేట రూరల్: పట్టణంలోని చింతలబస్తీ కాలనీ ఓ పాడుబడ్డ ఇంటిలో వ్యక్తి మృతదేహం లభించింది. ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం కాలనీలో పాడుబడ్డ ఇంటి వద్ద దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఇంటిలో 35 సంవత్సరాల పురుషుడి శవం కన్పించింది. శరీరంపై ఎరుపు రంగు డ్రాయర్, నీలం , తెలుపు గీతల చొక్కా ఉందని తెలిపారు. మృతదేహాన్ని అచ్చంపేట ప్రాంతీయ ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సదస్సును విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న గూట విజయ్

తాడూరు: ఈ నెల 7న ఉమ్మడి పాలమూరు జిల్లాలో నిర్వహించే మాదిగల ధర్మ యుద్ధ మహాసభ సదస్సును విజయవంతం చేయాలని జిల్లా ఎమ్మార్పీఎస్ కో కన్వీనర్ కర్నె పరమేష్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంఎస్‌పీ జిల్లా కన్వీనర్ గూట విజయ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు విజయ్,నాగన్న, ప్రకాష్, వెంకటయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



లింగాల: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా 68వ ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి క్రీడల్లో లింగాల సాంఘీక సంక్షేమ శాఖ బాలుర పాఠశాల, కళాశాలకు చెందిన విద్యార్థులు పరుగు పందెంలో ప్రతిభ కనబర్చారు. బి.భానుప్రసాద్(400) మీటర్లు, ఎ. గణేష్(200), డి.సంతోష్(1,500) మీటర్ల పరుగులో సత్తాచాటి పతకాలను సాధించగా హైజంప్‌లో కె.ఉదయకిరణ్ బంగారు పతకం సాధించాడు. ప్రిన్సిపాల్ బాలస్వామి, పీడీ వెంకటేశ్వర్లు, పీఈటీ నారాయణ, అధ్యాపకులు అభినందించారు.

ఉచిత విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



వెల్దండ: ఉచిత విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఏఈ సూర్యంనాయక్ పేర్కొన్నారు. మంగళవారం విద్యుత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని 32 గ్రామ పంచాయతీ పరిధిలో 2565 మంది వినియోగ దారులు ఉచిత విద్యుత్‌కు అర్హులు ఉన్నట్లు తెలిపారు. ఉచిత విద్యుత్‌కు అర్హులందరు మరోసారి దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించిందన్నారు. ఈనెల 5వ తేదీ వరకు చివరి గడువు విధించినట్లు తెలిపారు. ఇప్పటివరకు 230 మాత్రమే లబ్దిదారులు వివరాలను నమోదు చేసుకున్నట్లు తెలిపారు. మిగిలిన వినియోగ దారులకు కొంత మందికి రేషన్‌కార్డులు లేకపోవడం, మరికొందరు వలసవెళ్లడం, ఇంకొందరికి విద్యుత్ మీటర్లు లేకపోవడం, కొంతమంది ఫోన్‌లో అందుబాటులో లేకపోవడంతో వారి వివరాలను నమోదు చేయలేదన్నారు. అర్హులైన వారు ఆధార్‌కార్డు, ప్రజాపాలన దరఖాస్తు, విద్యుత్ మీటర్ నంబర్‌లను అందించాలన్నారు. దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలను ఆన్‌లైన్ నమోదు చేసినట్లు ఏఈ వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది లక్ష్మణ్‌నాయక్, తదితరులు ఉన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి



కొల్లాపూర్: యువత సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని మంత్రి జూపల్లి కృష్ణారావు తనయుడు, రత్నగిరి ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ జూపల్లి అరుణ్ సూచించారు. రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో యువతకు ఏర్పాటు చేసిన డ్రోన్ శిక్షణా శిబిరాన్ని హైదరాబాద్‌లో జూపల్లి అరుణ్ ప్రారంభించారు. నియోజకవర్గానికి చెందిన పలువురు యువతకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా డ్రోన్ శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని యువతకు స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేందుకు రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. శిక్షణ పొందిన వారికి ప్రైవేటు రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తమవంతు కృషిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ తదితరులు ఉన్నారు.

పాల బిల్లులు చెల్లించాలి

ఉప్పునుంతల: పాడి రైతులకు రావల్సిన పెండింగ్ పాల బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కొత్త రవీందర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రెండు నెలలకు సంబంధించిన పాలబిల్లులు ఇవ్వకపోవడంతో పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పాల బిల్లులు సకాలంలో ఇవ్వకపోగా రైతులు గ్రామాల్లో ప్రైవేట్ డెయిరీలకు పాలను అమ్ముకునే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘించొద్దు



చారకొండ: వాహనదారులు నిబంధనలు ఉల్లంఘించొద్దని ఎస్‌ఐ శంషోద్దీన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో దేవరకొండ కల్వకుర్తి ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ, డ్రంకెన్ డ్రైవ్ చేపట్టారు. వాహనదారుల పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ వాహనదారులు సరైన పత్రాలు ఉండాలని, లేనిచో చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. హెడ్ కానిస్టేబుల్ శ్రీశైలం, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

నిందితుడికి రిమాండ్

అచ్చంపేట రూరల్: ఓ మతాన్ని కించపరుస్తూ సోషల్‌మీడియాలో పోస్ట్‌చేసిన వ్యక్తిని మంగళవారం అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం పట్టణానికి చెందిన కుల్కుందాకారి శివాజీ మటన్ షాపు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 2న వాట్సప్ గ్రూపులో ఓ మతాన్ని కించపరుస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. కొందరు వ్యక్తులు అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రమేష్ కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరు పర్చారు. ఈ మేరకు జడ్జి నిందితుడికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో జాలర్ మృతి

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సోమశిల గ్రామ సమీపంలో కృష్ణానది బ్యాక్ వాటర్‌లో అనుమానాస్పదంగా రాజమండ్రికి చెందిన జాలర్ నాగరాజు (21) మృతి చెందాడు. ఎస్‌ఐ హృషికేష్ వివరాల ప్రకారం గుత్తేదారు మహేష్ నెల రోజుల కిందట చేపలవేటకు రాజమండ్రి నుంచి 12 మంది జాలర్లను తీసుకొచ్చారు. సోమవారం రాత్రి చేపల వేట అనంతరం సోమశిలకు వస్తున్న క్రమంలో జాలర్ నాగరాజు నదిలో పడి చనిపోయినట్లు గుత్తేదారు తెలిపాడని ఎస్‌ఐ పేర్కొన్నారు. గుత్తేదారు పొంతనలేని సమాధానాలు తెలపడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు కిందపడి వ్యక్తి దుర్మరణం

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రమాదవశాత్తు కిందపడి వ్యక్తి మృతిచెందిన సంఘటన జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని శ్రీపురం గ్రామానికి చెందిన బాకీ రాములు కూలి పనిచేసి జీవనం కొనసాగిస్తున్నాడు. సోమవారం ఉదయం నాగర్‌కర్నూల్‌కి కూలి పనికోసం వచ్చి రాత్రి ఇంటికి వెళుతుండగా బస్టాండ్ సమీపం కిందపడ్డాడు. తీవ్రగాయాలై అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

ధర్నాకు వెళ్లేందుకు అనుమతివ్వండి


ఉప్పునుంతలలో ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది


పెద్దకొత్తపల్లి ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్మికులు

ఉప్పునుంతల: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 6న కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని మంగళవారం గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, సిబ్బంది యూనియన్ నాయకులు ఎంపీడీఓ మోహన్ లాల్‌కు విజ్ఞప్తి చేశారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఎండీ హబీబ్, బీమయ్య, రమేష్, వెంకటస్వామి, అంకులు, లక్ష్మమ్మ, నవనీత పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ఎదుట బుధవారం నిర్వహించే ధర్నాకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని మంగళవారం పంచాయతీ కార్మికులు ఎంపీడీఓ నాగేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ మండల అధ్యక్షుడు బాలస్వామి మాట్లాడుతూ పెండింగ్ వేతనలు వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో చంద్రయ్య, మైసన్న భాస్కర్,ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెకుముకి పోటీల పోస్టర్ విడుదల



కల్వకుర్తి రూరల్: పట్టణంలోని ఆశ్రమ పాఠశాలలో మంగళవారం చెకుముకి పోటీల పోస్టర్‌ను మండల విద్యాశాఖ అధికారి శంకర్ నాయక్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 7న పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యాదమ్మ, చంద్రశేఖర్, నెహ్రూనాయక్, శ్రీనివాసులు, వీరభద్రం , ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారణ స్వీకరణ



లింగాల: మండల కేంద్రంలో మంగళవారం పలువురు అయ్యప్ప మాలధారణలు గావించారు. గురుస్వాములు రాంచంద్రయ్య, గండికోట శ్రీనివాసులు ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి ఆలయం సన్నిధానంలో దాదాపుగా 60 మంది స్వాములు అయ్యప్ప దీక్షను చేపట్టారు. అయ్యప్ప, ఆంజనేయస్వామి దీక్షలతో ఆలయాలు కిటకిటలాడాయి.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం



కల్వకుర్తి రూరల్: రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని పీఏసీఎస్ భవనంలో కొనుగోలు కేంద్రంలో ఇన్‌చార్జ్‌లు విధులు నిర్వర్తిస్తున్న వారితో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేశాక రైతుకు రశీదు ఇవ్వాలన్నారు. పలు విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శ్యామ్, వెంకటయ్య, పరీద్, సీఈఓ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్లెలకు బస్సులు నడపాలి

అమ్రాబాద్: ప్రతి పల్లెకు ఆర్టీసీ బస్సులు నడపాలని పదర మాజీ జెడ్పీటీసీ రాంబాబునాయక్ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. పదర మండలంలోని జోత్యానాయక్‌తండా, కోడోనిపల్లి, పల్లెరూట్‌పెంట, బాపన్‌పాడు గ్రామాలకు బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్‌డే



కల్వకుర్తి టౌన్: పట్టణంలోని మాడల్ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు మంగళవారం నిర్వహించారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించిన జూనియర్ విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు స్వాగతం పలికారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. శ్రీపాద శార్వాణి మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని సాధించాలన్నారు. అనంతరం సీఐ నాగార్జున మాట్లాడుతూ విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. వాణి, లెక్చరర్లు రాజు, శ్యాం సుందర్, జగదీశ్వర్ రెడ్డి, శ్రీనివాసులు, చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిట్స్‌తో వ్యక్తి మృతి

పెద్దకొత్తపల్లి: ఫిట్స్‌తో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని సాతాపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సతీష్ వివరాల ప్రకారం లింగాల మండలం జిన్నుకుంట గ్రామానికి చెందిన గాలెయ్య సాతాపూర్‌లో వరికోత మిషన్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం గాలెయ్య బహిర్భూమికి వెళ్లగా అక్కడ ఫిట్స్ వచ్చి అక్కడికక్కడే మృతిచెందాడు. మంగళవారం మృతుడి తల్లి ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

అచ్చంపేట రూరల్: మండలంలోని సింగారంలో మృతి చెందిన ఆంజనేయులు కుటుంబ సభ్యులను మంగళవారం మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పరామర్శించారు. ఆంజనేయులు మృతి బీఆర్‌ఎస్ పార్టీకి తీరనిలోటన్నారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహగౌడ్, నాయకులు పాల్గొన్నారు.